ఘనంగా వాల్మీకి జయంతి



వాల్మీకి జయంతి వేడుకల్లో వాల్మీకి మెహత సంఘం సభ్యులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వాల్మీకి మెహత సంఘం ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాలను మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని సూర్యనగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నమస్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేందర్, కరేన్, రాజేంద్ర, సుభాష్, అనిల్, రవి, ప్రియతమ్, బిట్టు, ఠాకూర్ రింకు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

చిక్కడపల్లి: మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నానని తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్, ఫాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోనె సాల్మన్‌రాజు అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన గాంధీనగర్‌లో విలేకరులతో మాట్లాడారు. పొన్నం ప్రభాకర్ అసభ్య పదజాలాన్ని వాడటం సరికాదన్నారు. ఉన్నత పదవిలో ఉండి తోటి మంత్రుల పట్ల గౌరవంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో సామాజిక న్యాయం సమానత్వం సాధించాలనుకునే కాంగ్రెస్ పార్టీ విలువలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బిషప్ తిమోతి, ఉపాధ్యక్షుడు పాస్టర్ మెన్నో జోయేల్, ప్రతినిధులు రిచర్డ్, జయకుమార్, హేమలత, శాలిని తదితరులు పాల్గొన్నారు.

వీధి లైట్లకు మరమ్మతులు చేపట్టండి

కాచిగూడ: వెలగని వీధి లైట్లతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ సమస్యను మంగళవారం అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జీహెచ్‌ఎంసీ స్ట్రీట్ లైట్స్ డీఈ అశోక్‌కుమార్, సిబ్బందితో కలిసి నింబోలిఅడ్డ, కుద్బిగూడ, చెప్పల్‌బజార్, బర్కత్‌పుర, నారాయణగూడ తదితర ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే వీధి లైట్లకు మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆమె అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు కన్నె రమేష్‌యాదవ్, బి.భీమ్‌రాజ ఎస్.రవియాదవ్, ఆర్.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట: సీఎం రిలీఫ్ ఫండ్ పథకం పేదల వైద్యానికి తోడ్పాటును అందిస్తోందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కోరారు. మంగళవారం గోల్నాకలోని ఆయన క్యాంపు కార్యాలయంలో 7 మందికి మంజూరైన రూ.3.65 లక్షల విలువ చేసే చెక్కులన అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వం అమలు చేసే పథకాలు లబ్ధిదారులకు అందేలా తన వంతు చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ

చిక్కడపల్లి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం వివేక్ నగర్ నల్లపోచమ్మ దేవాలయం వద్ద అన్నప్రసాద వితరణ చేశారు. భక్తుల అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నేతలు టి.గోపాల్, డాక్టర్ నరేష్‌గౌడ్, విద్యావేత్త సీహెచ్ వాణీశ్వరశాస్త్రి, సత్యందోనేటి, పి.నర్సింగ్‌రావు, కేబుల్ గోవర్ధన్, జర్నలిస్ట్ చిలుకూరి అఖిలేష్, బెలిదే హరినాథ్‌గుప్తా, భవానీశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

అంబర్‌పేట: అనారోగ్యానికి గురై కోలుకున్న బీజేపీ నేత రంగంపల్లి రాజును మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పరామర్శించారు. సోమవారం రాత్రి బాగ్‌అంబర్‌పేటలోని అతడి నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఓపెన్ హార్ట్ సర్జరీ కావడంతో తగు జాగ్రత్తలు తీసుకోవాలని దత్తన్న సూచించారు.



బీజేపీ నేత రంగంపల్లి రాజును పరామర్శిస్తున్న బండారు దత్తాత్రేయ

పాదచారికి దారేది?

కబ్జాలకు గురవుతున్న ఫుట్‌పాత్‌లు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



నారాయణగూడ చౌరస్తాలో రోడ్డుకిరువైపులా వ్యాపారాలు

కాచిగూడ: లక్షలాది రూపాయల వ్యయంతో బల్దియా పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు కబ్జాకు గురవుతున్నాయి. కాచిగూడ డివిజన్ లోని బర్కత్‌పుర, నారాయణగూడలో పలు చోట్ల వ్యాపారులు, స్థానిక నాయకులు కొందరు దర్జాగా ఫుట్‌పాత్‌లను కబ్జా చేసుకున్నారు, వీటిని కొంత మంది అద్దెకు ఇస్తున్నారు. వివిధ రకాల వ్యాపారులు, హోటళ్లు, ఫుట్‌పాత్‌లను కబ్జా చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాలనీల్లో అధికారులు చెట్ల కొమ్మలను కొట్టివేసి అక్కడే ఫుట్‌పాత్‌లపై, రోడ్లపై పడవేశారు. నెలలు గడుస్తున్నా వాటిని తొలగించడంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

రోడ్డుపైనే పాదచారుల రాకపోకలు...

- నారాయణగూడ, వైఎంసీఏ, బర్కత్‌పుర, కాచిగూడ స్టేషన్ తదితర ప్రాంతాల్లోని ప్రధాన రహదారులకు అనుకొని ఉన్న ఫుట్‌పాత్‌లు కబ్జా చెరలో ఉంటున్నాయి.
- నింబోలిఅడ్డ, గోల్నాక వరంగల్ జాతీయ రహదారిని రోడ్డు ఉదయం నుంచి రాత్రి వరకు వాహనదాల రద్దీతో ఉంటాయి.
- బర్కత్‌పురలో తాము ప్రతి రోజు ఉదయం పూట వాకింగ్ చేస్తుంటామని, అయితే ఫుట్‌పాత్‌లపై చెట్ల కొమ్మలు, ఇటుక, ఇసుక, చెత్త చెదారం పేరుకుపోయి ఉంటున్నాయని, గత్యంతరం లేక రోడ్డుపైనే వాకింగ్ చేస్తున్నామని వాకర్స్ అంటున్నారు.

ఫుట్‌పాత్‌లపైనే భవన నిర్మాణ సామగ్రి..

- జీహెచ్‌ఎంసీ అంబర్‌పేట సర్కిల్ పరిధిలోని కాచిగూడ, గోల్నాక, నల్లకుంట, అంబర్‌పేట, బాగ్ అంబర్‌పేట, హిమాయత్‌నగర్ తదితర ప్రాంతాల్లో రామదారులపై ఫుట్‌పాత్‌లపై భవన నిర్మాణ సామగ్రి గుట్టలుగా పోసి అమ్ముతున్నారు. రోట్లపై ఇసుక, ఇటుకతో నిండిన మినీ ట్రక్కులు కూడా ఉంటున్నాయి. దీంతో రోడ్లు కాస్తా ఇరుకుగా మారుతున్నాయి. భవన నిర్మాణదారులు తమ ఇంటి నిర్మాణ సామగ్రిని సైతం ఇంటి ముందే రోడ్డుపై వేస్తున్నారు.
- కాచిగూడ చౌరస్తాలో రోడ్డుపైనే హోటళ్ల ముందు ట్రాఫిక్ పోలీసులు నో పార్కింగ్ బోర్డు ఏర్పాటు చేసినా కార్లు ఇష్టానుసారంగా నిలుపుతుండటంతో చౌరస్తాలో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. ద్విచక్ర వాహనాలు ఫుట్‌పాత్, రోడ్డుపైనే పార్క్ చేసి ఉంచుతున్నారు.

హోటళ్ల ముందు సైతం

కాచిగూడ రైల్వే స్టేషన ఎదురుగా హోటళ్ల ముందు ఉదయం నుంచి రాత్రి వరకు ఆటోలు, ద్విచక్ర వాహనాలు, తోపుడు బండ్లు అక్రమంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రద్దీ వేళల్లో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

- కాచిగూడ, నారాయణగూడ, హిమాయత్‌నగర్‌లో హోటళ్ల ముందు ద్విచక్రవాహనాలు, కార్లు పార్కు చేసి ఉంటున్నాయి.
- ఫుట్‌పాత్‌లను కబ్జా చెర నుంచి విడిపించి పాదచారులకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.
- ఫుట్‌పాత్ అక్రమణలకు తోడు రోడ్లు కూడా గుంతల మయంగా మారడంతో ప్రజలు పడుతున్న బాధలు వర్ణనాతీంగా ఉంటున్నాయి.
- ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సమస్యల పరిష్కారం దిశగా కృషి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



బర్కత్‌పుర రెడ్డి ఉమెన్స్‌కాలేజ్ రోడ్డులో పడేసిన చెట్లకొమ్మలు



తెలంగాణ యువతి మండలి ఎదురుగా గుంతలమయంగా మారిన రోడ్డు

ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ ప్రోత్సాహంతోనే సీజేఐపై దాడి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ ప్రోత్సాహంతోటే సీజేఐ బీఆర్ గావాయ్‌పై దాడి జరిగిందని కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు విమర్శించారు. మంగళవారం సుందరయ్య పార్కు వద్ద కేవీపీఎస్ ఆధ్వర్యంలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్. గవాయ్‌పై దాడికి వ్యతిరేకంగా నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా స్కైలాబ్ బాబు మాట్లాడుతూ... ఆర్‌ఎస్‌ఎస్ ముసుగులో ఉన్న అరాచక న్యాయవాది రాకేష్ కిషోర్ తన షూ విసిరి న్యాయ వ్యవస్థను అపహాస్యం చేశారని విమర్శించారు. ఒక దళితుడు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉండటాన్ని ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ జీర్ణించుకోవడం లేదని అన్నారు. ఇటీవల కాలంలో దేశ ప్రజల్లో నింపుతున్న విద్వేషాల ఫలితంగానే ఈ ఘటన జరిగిందన్నారు. ఈ దాడికి ప్రధానమంత్రి, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ బాధ్యత వహించాలన్నారు.

- ఇటీవల ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల వేడుకలకు జస్టిస్ గావాయ్ తల్లిని ఆహ్వానించగా ఆమె తిరస్కరించారని గుర్తు చేశారు. యూపీలోని బీజేపీ సర్కార్ బుల్డోజర్లతో ఇళ్లను కూల్చివేస్తున్న సందర్భంగా బుల్డోజర్ న్యాయం చెల్లదని.. రాజ్యాంగ న్యాయం చెల్లుతుందని సీజేఐ తీర్పునిచ్చారని తెలిపారు. దీంతో కక్ష పెంచుకున్న ఆర్‌ఎస్‌ఎస్ వాది దాడికి పాల్పడ్డారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం కార్యదర్శి టి.సాగర్, ఎం.ధర్మనాయక్, కోటా రమేష్, కృపాసాగర్, ఎం. దశరథ్, మహేందర్, సుబ్బారావు, జి.రాములు, స్వాతి, లక్ష్మీ, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్య పార్కు వద్ద సీజేఐ గవాయ్‌పై దాడికి వ్యతిరేకంగా కేవీపీఎస్ నాయకుల నిరసన ర్యాలీ

సీజేఐపై దాడి అంటే న్యాయ వ్యవస్థపై దాడే..

బీఎల్పీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సీజేఐ బీఆర్ గావాయ్‌పై దాడిని న్యాయ వ్యవస్థపై దాడిగా భావించాలని బహుజన లెఫ్ట్ పార్టీ (బీఎల్పీ) రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ అన్నారు. దాడికి యత్నించిన రాకేష్ కిషోర్ అనే న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీజేఐపై దాడి చేయడమంటే భారత రాజ్యాంగంపై ఫాసిస్టు దాడిగా భావించాలన్నారు.

22న నారాయణగూడ సదర్

కాచిగూడ: అమవాస్య రెండు రోజులు రావడం వల్ల అయోమయం నెలకొన్న నేపథ్యంలో వేద పండితుల సలహా మేరకు ఈనెల 22వ తేదీన నారాయణగూడ పెద్ద సదర్ వేడుకలను నిర్వహించాలని నిర్ణయించినట్లు గ్రేటర్ హైదరాబాద్ జాంబాగ్ యాదవ సంఘం చైర్మన్ చిట్టబోయిన నందకిషోర్ యాదవ్ తెలిపారు. మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈనెల 20వ తేదీన లక్ష్మీ పూజలు, 21వ జంటనగరాల సదర్ సమ్మేళనాలు జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భజరప్ప స్మారక పురస్కార ప్రదానోత్సవం

చిక్కడపల్లి: సిరిమువ్వ కల్చరల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో మంగళవారం రాత్రి త్యాగరాయ గానసభలో భజరప్ప స్మారక పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ రంగస్థల నటి బసవ హైమవతికి ప్రముఖ నటుడు ఎంబీఆర్ శాస్త్రి ముఖ్యఅతిథిగా హాజరై పురస్కారాన్ని ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాలుగు దశాబ్దాలకు పైగా హైమవతి పౌరాణిక, సాంఘిక నాటకాల్లో వివిధ పాత్రలను పోషించి ప్రజాభిమానాన్ని పొందారన్నారు. తొలుత మంజునాథ రచించిన దర్శకత్వం వహించిన గేమ్ నాటిక ప్రదర్శన ప్రేక్షకరంజకంగా సాగింది. ఆచార్య డీఎస్ఎన్ మూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

చిక్కడపల్లి: మద్యం సేవించి వాహనాలు నడిపిన 10 మందికి జరిమానా ఒకరికి 3రోజుల జైలు శిక్ష విధించినట్లు చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎడుకొండలు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన సాక్షితో మాట్లాడుతూ... మద్యం సేవించి వాహనాలు నడిపిన 10మందిని కోర్టులో హాజరుపరిచామని అన్నారు. ఒక్కొకరికి రూ.3,100 జరిమానా విధించారని ఆయన తెలిపారు.

సిగాచి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి

చిక్కడపల్లి: సిగాచి పరిశ్రమ ప్రమాద బాధిత కుటుంబాలకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు డిమాండ్ చేశారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని కార్మికశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ప్రమాద బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 54 మంది కుటుంబ సభ్యులకు మిగిలిన రూ.75లక్షలను ఒకే విడతలో ఇవ్వాలన్నారు. ప్రమాదానికి కారణమైన యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షలను వెంటనే విడుదల చేయాలన్నారు. బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం జరిగే వరకు సీఐటీయూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు పాలడుగు భాస్కర్, వీరయ్యే, మల్లికార్జున్, రమా, వెంకటేశ్, పద్మశ్రీ, సోమన్న, పాండురంగారెడ్డి, శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కార్మికశాఖ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీఐటీయూ రాష్ట్ర నేతలు

బీటెక్ విద్యార్థిపై దాడి చేసిన యువకుల రిమాండ్

అంబర్‌పేట: బీటెక్ విద్యార్థిపై దాడి చేసిన యువకులను పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం అంబర్‌పేట పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశంలో కాచిగూడ ఏసీపీ హరీష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ వివరాలను వెల్లడించారు. మేడిపల్లిలో నివసించే నరేష్ కుమారుడు అభినవ్ బాగ్‌అంబర్‌పేటలోని తన మామయ్య నివాసంలో జరిగిన పూజకు హాజరయ్యాడు. సోమవారం రాత్రి సమయంలో కొద్దపాటి పరిచయం ఉన్న గౌతంతో స్వల్ప వాగ్వాదం జరిగింది. దీంతో గౌతం అప్పటికప్పుడు అతడి స్నేహితులను పిలిపించి అభినవ్‌పై దాడి చేశారు. సుమారు 20 మంది యువకులు ముకుమ్మడిగా అభినవ్‌పై విచక్షణ రహితంగా దాడి చేశారు. బీరు సీసాలతో దాడి చేయడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. తండ్రి నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు తక్షణమే స్పందించారు. దాడికి పాల్పడ్డ వారిలో ఐదుగురిని అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిలో స్థానికంగా నివసించే డి.గౌతం(18), డి.సంపత్(20), బి.యశ్వంత్(21), ఏ.శివకుమార్(26), బి.భాస్కర్(22)లు ఉన్నారు. వీరిని రిమాండ్‌కు తరలించారు. వరుస నేరాలకు పాల్పడితే రౌడీషీట్ తెరుస్తామని ఈ సందర్భంగా ఏసీపీ హెచ్చరించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ హరీష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్

బీసీ రిజర్వేషన్లపై 30 పైగా ఇంప్లీడ్ కేసులు



మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ తదితరులు

కాచిగూడ: స్థానిక సంస్థలలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల కేసులో 30కి పైగా బీసీ సంఘాలు మంగళవారం హైకోర్టులో ఇంప్లీడ్ కేసులు వేసినట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుజ్జ సత్యం, పగడాల శ్రావణి, అల్లంపల్లి రామకోటి, రామ్మూర్తి గౌడ్, సి.రాజేందర్, అనంతయ్య, చెరుకు మణికంఠ, నీల వెంకటేష్, పగిళ్ల సతీష్, భాస్కర్ ప్రజాపతి, జగదీష్, పగడాల సుధాకర్, తదితర బీసీ సంఘాల నేతలు కేసులు వేశారని తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243-డి6 ప్రకారం స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి రాజ్యాంగం ఇచ్చిందన్నారు. దీంతో అసెంబ్లీలో ప్రభుత్వం చట్టం చేశారని వారు పేర్కొన్నారు.

- సుప్రీంకోర్టు అగ్రకులాలకు 10శాతం రిజర్వేషన్లు పెంచినప్పుడు కేసులో 50శాతం సీలింగ్ ఎత్తివేశారని తెలిపారు. ఇందిరా సహానీ కేసులో ఎంపరికల్ డేటా ఉంటే 50శాతం సీలింగ్‌ను అధిగమించవచ్చని సుప్రీంకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసిందన్నారు. అన్ని కోణాల్లో చూస్తే బీసీలు కేసు గెలిచే అవకాశం ఉందన్నారు. చట్ట ప్రకారం రాజ్యాంగపరమైన అవరోధాలు లేవని పేర్కొన్నారు. సుప్రీంకోర్టులో కేసు గెలుస్తుందని వారు ధీమా వ్యక్తం చేశారు. రిజర్వేషన్లు పెంచడానికి కులాల వారీగా లెక్కలు తీసి, అసెంబ్లీలో చట్టం చేశారని తెలిపారు.

బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవాలని చూస్తే ఖబడ్దార్



అలీకేఫ్ చౌరస్తా పూలే విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మాజీ ఎంపీ వీహెచ్, బీసీ సంఘాల నేతలు

అంబర్‌పేట: బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవాలని చూస్తున్న సంస్థలు, వ్యక్తులు చేస్తున్న ప్రయత్నాలకు నిరసనగా బీసీ సంఘాలు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలను చేపట్టాయి. అందులో భాగంగా మంగళవారం బీసీ సంక్షేమ సంఘం, బీసీ జాగృతి సంఘాల ఆధ్వర్యంలో అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తా మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా మాజీ ఎంపీ వీహెచ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... న్యాయస్థానాలను అడ్డుపెట్టుకుని బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవాలని చూస్తున్న రెడ్డి జాగృతిపై వారు మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ లేదంటూ రెడ్డి జాగృతి సంస్థ న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సిన అవసరం ఏముందని వారు నిలదీసారు. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఉంటే తప్పేంటని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లపై బీజేపీ ఎందుకు స్పష్టత ఇవ్వడం లేదని ప్రశ్నించారు. బీజేపీ రెండు నాలుకల ధోరణి వల్లనే రాష్ట్రపతి, గవర్నర్ బిల్లును ఆమోదించడం లేదని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దిడ్డి రాంబాబు, నారాయణస్వామి, నాయకులు శంభుల శ్రీకాంత్‌గౌడ్, గరిగంటి రమేష్, కుందారం గణేష్‌చారి, కుల్కచర్ల శ్రీనివాస్, మురళీకృష్ణ, దివిటి మల్లయ్య, బీ.మని మంజరి, లింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అడుక్కోవడం కాదు.. హక్కులు కోసం గళమెత్తాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాట్లాడుతున్న ముద్రబోయిన రచన

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ట్రాన్స్‌జెండర్స్, హిజ్రాలు అడుక్కోవడం కాదు... తమ హక్కుల విషయంలో గళమెత్తి ప్రభుత్వ మెడలు వంచాలని ఆల్ ఇండియా ట్రాన్స్‌జెండర్స్ నాయకురాలు ముద్రబోయిన రచన పిలుపునిచ్చారు. మంగళవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ట్రాన్స్‌జెండర్స్ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రచన మాట్లాడుతూ... సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరిస్తేనే మంచి గుర్తింపు ఉంటుందన్నారు. హక్కుల కోసం పోరాడుతూనే ప్రజలతో మమేకం కావాలని కోరారు.

- టీపీఎస్‌కే అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... తెలంగాణలో ట్రాన్స్‌జెండర్స్ సుమారు 3 లక్షల మంది ఉన్నారని పేర్కొన్నారు. వారి సమస్యలను తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కారించాలని కోరారు. విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్ జెండర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు మోనాలిసా, సంఘ మిత్ర సోని, మనోరమ, ప్రియ, శిల్ప, శోభ, సమీర, సోనా రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

బస్ చార్జీలను తగ్గించాలి

ముషీరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం నగరంలో పెంచిన ఆర్టీసీ బస్ టికెట్ ధరలను వెంటనే తగ్గించాలని బీఆర్‌ఎస్ భోలక్‌పూర్ వై.శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి స్టేజీకి రూ.5 పెంచడం దారుణమని అన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలపై పెంచిన టికెట్ చార్జీల వల్ల అధిక భారం పడనుందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే పెంచిన చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు ఉమాకాంత్, శంకర్‌గౌడ్, ప్రవీణ్, ప్రవీణ్‌కుమార్, మగ్బూల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వై.శ్రీనివాస్‌రావు

ఉద్రిక్తతల నడుమ పాలస్తీనా సంఘీభావ ప్రదర్శన

- అనుమతి లేదంటూ అడ్డుకున్న పోలీసులు
- అయినా ప్రసంగాలు చేసిన మద్దతుదారులు



సభలో మాట్లాడుతున్న అజీజ్ పాషా, జాన్‌వెస్లీ

కవాడిగూడ: పాలస్తీనా సంఘీభావ కమిటీ ఆధ్వర్యంలో అశోక్‌నగర్ నాలా నుంచి ఇందిరాపార్కు ధర్నాచౌక్ వరకు మంగళవారం పాలస్తీనా సంఘీభావ ప్రదర్శనను నిర్వహించారు. ఈ ప్రదర్శనకు ఎలాంటి అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకోవడంతో ధర్నాచౌక్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అయినా సరే ఈ సభకు హాజరైన వారు తమ ప్రసంగాలను పూర్తి చేశారు. ఆ తర్వాతే పోలీసులు వారందరినీ అరెస్టు చేసి, వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు.

- ఈ సందర్భంగా అజీజ్ పాషా మాట్లాడుతూ.. పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న దుర్మార్గ యుద్ధాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. భారతీయులు పాలస్తీనాకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు.
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ... అమెరికా అండదండలతో ఇజ్రాయెల్ పాలస్తీనాపై యుద్ధం కొనసాగిస్తోందని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇజ్రాయెల్‌కు అనుగుణంగా వ్యవహరిస్తోందని ఆయన మండిపడ్డారు.
- ఎస్‌యూసీఐ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ మురహరి మాట్లాడుతూ.. అమెరికా మద్దత్తుతో ఇజ్రాయెల్ పాలస్తీనాలోని గాజాను ఆక్రమించుకోవాడానికి ప్రయత్నిస్తోందని అన్నారు.
- ప్రొ. అన్సారీ మాట్లాడుతూ... శాంతియుత ప్రదర్శనకు పోలీసుల అనుమతి నిరాకరించడమంటే ఇజ్రాయెల్‌కు మద్దతు ప్రకటించడమేనని అన్నారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకురాలు కె.రమ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ నాయకులు రవి, సీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య, జామెతే హింద్ నాయకురాలు ఖాలీదా పర్వీన్ తదితరులు హాజరై మద్దతు ప్రకటించారు.



సంఘీభావ ర్యాలీలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి, జాన్‌వెస్లీ, మాజీ ఎంపీ అజీజ్ పాషా తదితరులు